# వృద్ధికి రాదగిన కళ

"రావు"

నాకు చిన్ననాటినుంచీ రమణయ్య గారంటే పితృభావం. ఆయన మా తండ్రిగారికి ఆప్త మిత్రులు. మా కుటుంబ క్షేమాన్ని ఎప్పుడూ కోరేవారు. ఆయన కూడా నన్ను పుత్రవాత్సల్యంతో చూసేవారు. పట్నం ఎప్పుడు వెళ్ళినా నా బస వారింట్లోనే. వారిచ్చిన అమూల్యమైన సలహాలను జీవితంలో అంతవరకూ నేను తోసి వేసి ఎరుగను.

'అబ్బాయీ, నీ ఉద్యోగ ప్రయత్నాలెంత వరకు వచ్చాయి ?'— అని రోజూలాగే ఆనాడు సైతం ఆయన నన్ను ప్రశ్నించారు.

'ఏం ఉద్యోగాలండీ ! ఎక్కడా ఏమీ ఖాళీలు లేవు. ఇంత బి.యే. ప్యాసయి చూస్తూ చూస్తూ ఏభై రూపాయిల నౌకరీలో ప్రవేశించడం ఎలాగండీ ! నా యోగ్యతకు ఇంత తక్కువ ఉద్యోగమా ? ఏభై రూపాయిలతో ఇలాటి పట్నంలో జీవితం గడపడం ఎలా?' అన్నాను.

'ఈ ఊళ్ళో ఏభై రూపాయిలైనా రాని ఉద్యోగాలను చేస్తున్నవాళ్ళను ఎంత మందిని చూపను ? వెర్రివాడా ! నీకు వచ్చే జీతంలో ఏముందోయ్ — పైగా పదిరాళ్ళు గిట్టుబాటు అయే మార్గం ఉంటే ఆ ఉద్యోగంలో తప్పక ప్రవేశించ వలసిందే ! పైన ఏమైనా వచ్చే ఆస్కారా లుంటే అది జీతం భత్యం లేని గౌరవోద్యోగమైనా వెంటనే కళ్ళు మూసుకొని చేరి పొమ్మని నా సలహా. ఎంతమంది వేలకొద్దీ తగలేసి గౌరవోద్యోగాలకు ప్రాకులాడడం లేదు ? పెట్టుబడికి పదింతలు తరువాత వచ్చే సూచన లున్నపుడు అది కేవలం గౌరవోద్యోగమైతే మటుకు నష్టం ఏమిటి ?'

'అంటే మీ ఉద్దేశ్యం లంచాలు తీసికొని బతకమనా ? అది నా వల్ల కాదు. లక్ష జన్మలెత్తినా నేను అటువంటి అవినీతి పని చెయ్యలేను. ఇప్పటికే లంచగొండులతో దేశం ఎంత అధోగతికి పోతోందో చూడండి...' అంటూ ఉద్రేకంతో ఇంకా ఇంకా ఏదో మహోపన్యాసం చేసేశాను.

నామాటలన్నీ విని రమణయ్యగారు ఒక్క వెటకారపు నవ్వు నవ్వారు. అందులో నన్ను 'వెర్రివెధవా' అని తిట్టినట్లు స్పష్టంగా గోచరించింది. నా అజ్ఞానానికి జాలిగొన్నవాడిలా ఆయన ముఖం పెట్టి నన్ను ఈ చిన్న ప్రశ్న వేశారు—'అబ్బాయ్, నీవు చెప్పదలచుకొన్నదయిందా? అయితే ఈ ప్రశ్నకు సమాధానం చెప్పు. ప్లీడరు నీకు చిన్న సలహా ఏదో చెప్పి వందలకొద్దీ తీసికొంటున్నా, డాక్టరు ఏదో మందును చిన్న చీటీపై వ్రాసి డబ్బు తీసికొన్నా దానిని 'ఫీజు' అంటారు. అలాగే నీకు కావలసిన సలహాగాని, సహాయంగాని ఏ శాసన సభ్యుడో, లేక ఏ ప్రభుత్వోద్యోగో ఇచ్చి అందుకు ప్రతిఫలంగా నీవద్ద కొంత డబ్బు తీసికొంటే దాన్ని మటుకు ఎందుకు 'ఫీజు' అనకూడదు? '

'వాళ్ల నిబంధనల ప్రకారం అలా డబ్బు తీసికోవడం నిషేధింపబడింది కనుక అది లంచం అవుతుంది.' అన్నాను అమాయికంగా.

'నిబంధనలు తయారుచేసే ప్రభుత్వోద్యోగి నీ వద్దనుండి తాను చేసిన సహాయానికి డబ్బు కోరితే అది పరోక్షంగా ప్రభుత్వ నిబంధనను సవరించినట్లు అర్థం కాదా!" అని బాబుగారు ఎదురు ప్రశ్న వేసేటప్పటికి నా నోరు కట్టడి పోయింది.

కొంచెం గొంతు సవరించుకొని, గంభీరంగా రమణయ్య బాబుగారు నాకు మహోపదేశం చెయ్యడం మొదలు పెట్టారు. ''మనం ఇచ్చే డబ్బు కొన్ని సమయాల్లో కొందరు వ్యక్తులు తీసుకొంటే ఫీజు, మరికొందరు వ్యక్తులు తీసికొంటే లంచం అవుతుం దన్నమాట. అంటే

లేడా మనం పెట్టే పేరులో మాత్రమే ఉందన్న మాట. అబ్బాయి! అసలు సంగతి చెపుతున్నా విను. లంచం అంటూ ఎక్కడా లేదు. ఏనాడో ఎవడో వ్రాసిన న్యాయచట్టంలో ఒక విధంగా డబ్బు తీసికొంటే అది లంచం అవుతుందని నిర్వచించి నంతమాత్రాన మనం ఆ నిర్వచనాన్ని పట్టుకు దేవుళ్ళాడ నక్కరలేదు. ఒకనాడు లంచంగా పరిగణింపబడేది మరొకనాడు లంచం కాకపోవచ్చును; లంచం అనేది మన మనో భావనే. నిర్వచనాలను కాలానుగుణంగా మార్చుకోవాలి. లంచం తీసికోవడం 'అవినీతి' అనేకంటె లంచం తీసుకోలేనివాడు 'అసమర్థుడు' అంటే సమంజసంగా ఉంటుంది. ఉద్యోగి నేర్పరితనం అతడు లంచంద్వారా సంపాదించిన ధనం వల్లే వ్యక్తమవుతుందని నా అభిప్రాయం. ఎంత లంచగొండి అయితే అంత నేర్పరి అన్న మాట. నాదృష్టిలో లంచగొండితనం అనేది ఒక కళ. లంచగొండితనాన్ని కళగాను, లంచగొండిని కళాకారుడుగాను, లంచం ఇచ్చేవాడిని కళారాధకుడుగాను పరిగణించ వచ్చు. ఈ కళకు మంచి ఉజ్జ్వల భవిష్యత్తు ఉంది. మున్ముందు ఈ కళను ఎంత ఎక్కువగా అభిమానిస్తే వాడు అంత ఎక్కువగా రాణిస్తాడు. లంచగొండితనం ఒక్క కళేకాదు. అది శాస్త్రంగూడా. ప్రస్తుతం ప్రజల దృష్టిలో ఆ శాస్త్ర సూత్రాలకు అంత ఆదరణ లేకపోవచ్చును. ఒకానొకప్పుడు భూమి గుండ్రంగా ఉందన్న వాళ్ళందరినీ జైళ్ళలో బంధించారు. కాని రాను రాను వారి మాటలే నిజం అని తేలింది. అలాగే లంచగొండి శాస్త్ర సూత్రాలకు ఇంకా అత్యధికంగా ఆదరణ లేని ఈ రోజుల్లో లంచగొండితనం మంచిదని ప్రచారంచేస్తే కొందరిని జైళ్ళలో బంధించ వచ్చును. కాని మున్ముందు ఈ సూత్రాలకు విలువ హెచ్చుతుంది. ప్రస్తుత కాలవాహినిని గమనిస్తున్న నేను ఈవిషయాన్ని ఘంటాపథంగా చెప్పగలను. ఈ శాస్త్రానికి రాజాదరణ తప్పక ఏర్పడుతుంది. కొన్ని రోజులలో లంచగొండితనాన్ని ఆరాధించని మనిషి, ప్రోత్సహించని ప్రభుత్వం, ఆశీర్వదించని దేవుడు ఉండడనే మాట స్పష్టం. లంచాలను తీసికొనేది ఒక్క మానవులే కాదు. దేవతలు సృష్టి ప్రారంభంనుంచీ లంచాలు తీసికొంటూనే వచ్చారు. అరటిపళ్ళు, కొబ్బరికాయలతో ఆరాధిస్తే దేవుడు తప్పక నీ కోర్కెలు నెరవేరుస్తాడు. అంటే దేవుడుగూడా నీ దగ్గరనుంచి తగిన ప్రతిఫలం పొందండే నీకు ఉపకారం చెయ్యా డన్న మాట. ఎల్లప్పుడూ భగవన్నామస్మరణ చేస్తే భగవంతుడు మోక్షం ఇస్తాడు. అంటే స్వర్గంలో నీకో ఉద్యోగం ఇస్తా డన్న మాట. అలాగే మంత్రులు, తదితర ఉన్నతోద్యోగుల స్మరణచేస్తూ వారి చుట్టూ తిరుగుతూ ఉంటే నీకూ ఉద్యోగం ఇస్తారు. అంతమాత్రంచేత అది అవినీతా? ఒకే పని దేవతలు చేస్తే మంచిది, మానవులు చేస్తే చెడ్డది అవుతుందా? కాబట్టి అనవసరపు ఆర్భాటాలకు పోయి ఆడుక్కుతినకు. మొదట్లో నీకంటె పెద్ద మాటలను చెప్పినవాళ్ళను అనేకమందిని చూశాను. వాళ్ళూ చివరకు లంచాలు పుచ్చుకోక తప్పలేదు. పెద్ద ధనవంతులయి వారంతా ఇపుడు దివ్యంగా చలామణీ అయిపోతున్నారు. ఏదోవిధంగా ధనం సంపాదించుకో. అప్పుడు గౌరవం దానంతట అదే వచ్చివేస్తుంది' అని నల్లమందువేళ అవడంవల్ల బాబుగారు ఉపదేశం చాలించారు.

నేనుమటుకు నిశ్చేష్టుడనై అలాగే నిలిచిపోయాను. నేటివరకూ ఆయన అన్న ఆఖరి మాటలు-'ఏదోవిధంగా ధనం సంపాదించుకో. అప్పుడు గౌరవం దానంతట అది వచ్చివేస్తుంది'-నా చెవులలో మోగుతూ ఉంటాయి.

---

